పొలంలో నాట్లు వేస్తున్న తున్కిఖాల్సా విద్యార్థులు



నాట్లు వేసిన చిట్టిచేతులు

బడి పిల్లలు పొలం బాట పట్టారు. చిట్టిచేతులతో నాట్లు వేశారు. ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా 'అన్నదాత స్వేదం చిందిస్తున్న తీరు.. సాగు కష్టాలు' ప్రత్యక్షంగా వీక్షించేందుకు వర్గల్ మండలం తున్కిఖాల్సా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గురువారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. సాగులో చిన్నారులు భాగస్వాములయ్యారు. వ్యవసాయ ప్రాధాన్యత, ఆహార భద్రతపై అవగాహన పెంచుకున్నారు. ఈ సందర్భంగా 'రైతులను గౌరవిద్దాం, వారిని కాపాడుకుందాం' అంటూ ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. – వర్గల్(గజ్వేల్)

తీజ్ సంబురం

హుస్నాబాద్ మండలం బిల్లెలగడ్డలో గురువారం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలంటూ గిరిజనులు పూజలు చేశారు. గిరిజన వేషధారణలో మహిళలు నృత్యాలు చేస్తూ ఆడిపాడారు. – హుస్నాబాద్‌రూరల్



న్యూస్‌రీల్

విద్యాధరి సన్నిధిలో మండలి డిప్యూటీ చైర్మన్

మనవడికి అక్షరాభ్యాసం



మనవడికి అక్షరాభ్యాసం చేయిస్తున్న ప్రకాశ్

వర్గల్(గజ్వేల్): రెండో బాసరగా పేరొందిన వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రాన్ని గురువారం శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ కుటుంబసభ్యులతో కలిసి సందర్శించారు. అమ్మవారి సన్నిధిలో తన మనవడు భవ్యాంక్‌కు శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేయించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు, నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజ అనంతరం అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. క్షేత్రం బాగుందని, చదువుల తల్లి సన్నిధిలో మనవడి అక్షరశ్రీకారం సంతోషకరమని డిప్యూటీ చైర్మన్ పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రండి

మంత్రి వివేక్‌కు ఆహ్వానం



మంత్రి వివేక్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుబ్బాక: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన బాలాజీ ఆలయం బ్రహ్మోత్సవాలకు రావాలంటూ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌కు కాంగ్రెస్ నాయకులు ఆహ్వాన పత్రికను అందించారు. ఆగస్టు 3 నుంచి వారం రోజుల పాటు బాలాజీ ఆలయ బ్రహ్మోత్సవాలు జరుగుతాయని వివరించారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల దేవేందర్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

బాలలతో పని చేయిస్తే చర్యలు

రాయపోల్‌లో ఐదుగురికి విముక్తి

దుబ్బాకటౌన్: బాలలతో పని చేయిస్తే యజమానులపై కఠిన చర్యలు చేపడతామని కార్మిక శాఖ అధికారి జ్యోతి హెచ్చరించారు. రాయపోల్ మండల పరిధిలోని రాంసాగర్‌లో చిక్ ఫీడ్ సంస్థలో పని చేస్తున్న ఐదుగురు బాలలకు గురువారం విముక్తి కల్పించారు. రాంసాగర్‌లో సత్యేంద్ర కుమార్, సమాధాన్ తాత్యాబ్‌లు చిక్ ఫీడ్ సంస్థను నిర్వహిస్తున్నారు. అందులో బాలురులను పనికి నియమించారు. సమాచారం అందుకున్న జిల్లా కార్మిక శాఖ అధికారి జ్యోతి ఆధ్వర్యంలో కార్మిక శాఖ అధికారులు సంస్థపై దాడి చేశారు. ఐదుగురికి విముక్తి కల్పించారు. జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ మానస తెలిపారు.

ముదిరాజ్ పోరాట సమితి ఉపాధ్యక్షుడిగా రాజు



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జగదేవ్‌పూర్‌కు చెందిన ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు రాగుల రాజు ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎన్నుకున్నారు. ముదిరాజ్ సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని, అభివృద్ధికి కృషి చేయాలని రాజకీయ చైతన్యం వైపు నడిపించాలని సూచించారు. రాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు.

పొన్నాల బాలయ్యకు 'సినారే' పురస్కారం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత పొన్నాల బాలయ్యకు సినారె సాహిత్య పురస్కారం వరించిందని మంజీర రచయితల సంఘం సభ్యులు గురువారం తెలిపారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మహాకవి సినారె పేరిట సాహిత్య పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఆగస్టు 3న జరిగే ప్రత్యేక కార్యక్రమంలో బాలయ్యకు ఈ అవార్డును అందజేస్తారన్నారు. ఉత్తమ సాహిత్య పురస్కారం లభించడంతో మంజీరా, తెలంగాణ రచయితల సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

విధులకు ఎగనామం

పంచాయతీ కార్యదర్శుల నకిలీ హాజరు

- ముఖ హాజరుతో మాయాజాలం
- విధులకు రాకుండానే హాజరైనట్లు నమోదు
- అడ్డంగా దొరికిన 70 మంది
- నోటీసులు జారీచేయాలంటూ కలెక్టర్ ఆదేశాలు



సాక్షి, సిద్దిపేట: కొందరు పంచాయతీ కార్యదర్శులు ముఖహాజరుతో మాయాజాలం చేస్తూ విధులకు ఎగనామం పెడుతున్నారు. లొకేషన్‌లో ఫొటో తీసినట్లు అటెండెన్స్ వేసుకుంటూ గ్రామ పంచాయతీకి వెళ్లకుండానే ఊర్లు.. ఫంక్షన్లకు వెళ్తున్నారు. ఇలా ఫేక్ అటెండెన్స్ వేస్తూ కొందరు అడ్డంగా దొరికిపోయారు. పంచాయతీ కార్యదర్శులు సమయపాలనకు, గ్రామాల్లో సేవలు అందించేందుకు, డుమ్మాలకు చెక్ పెట్టేందుకు పంచాయతీ శాఖ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ యాప్‌ను అమల్లోకి తీసుకువచ్చింది. ప్రభుత్వాన్నే తప్పుదారి పట్టించి 70 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఫేక్ అటెండెన్స్ వేశారు. గురువారం వారిని గుర్తించారు. దీంతో వారికి నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ హైమావతి ఆదేశించారు.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలులో గ్రామ పంచాయతీ కార్యదర్శులది కీలక పాత్ర పోషిస్తారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు సక్రమంగా లబ్ధిదారులకు అందాలంటే కార్యదర్శులు విధులకు డుమ్మాలు కొట్టవద్దు. ఉద్యోగులు నిత్యం వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వారి నివాసాలు పట్టణాల్లో ఉండటంతో సమయపాలన పాటించడం లేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. విధులకు హాజరుకావడం లేదని పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దీంతో ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను పంచాయతీ శాఖ తీసుకవచ్చింది. 8 నెలలుగా అమలు చేస్తున్నారు. కార్యదర్శులు విధులు నిర్వర్తించే గ్రామంలో లొకేషన్‌కు వెళ్లి ఫోటో తీసి పంచాయతీ యాప్‌లో నమోదు చేసి అటెండెన్స్ వేసుకోవాలి.

ఫేక్ అటెండెన్స్

జిల్లా వ్యాప్తంగా 508 గ్రామ పంచాయతీలుండగా 470 మంది పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. పలువురు పంచాయతీ కార్యదర్శులకు మరో గ్రామ పంచాయతీ సైతం ఇన్‌చార్జి కేటాయించారు. వీరు ప్రతి రోజు ఉదయం 10 గంటల వరకు గ్రామ పంచాయతీకి చేరుకుని ఫేస్ రికగ్నిషన్ యాప్ ద్వారా అటెండెన్స్‌ను ఫోన్‌లో వేసుకోవాలి. పలువురు పంచాయతీ కార్యదర్శులు విధులకు డుమ్మాలు కొట్టి.. గ్రామ పంచాయతీ సిబ్బందికి యాప్ లాగిన్‌ను ఇచ్చి ఫొటోతో.. ఫోటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. 8 నెలలుగా పలువురు ఇదే విధంగా హాజరు వేసుకుంటూ డుమ్మా కొడుతున్నారు. బుధవారం నుంచి డీపీఓలకు ప్రత్యేక లాగిన్‌ను ఇచ్చారు. దీంతో యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్న ఫొటో వ్యక్తిదేనా.. నేరుగా దిగి అప్‌లోడ్ చేశారా.. ఫొటోను ఫొటో తీసి అప్‌లోడ్ చేశారా? అని పరిశీలించాలని డీపీఓలకు ఆదేశించారు. దీంతో రెండు రోజులుగా డీపీఓ నేతృత్వంలో పరిశీలించగా ఫేక్ అటెండెన్స్ వేస్తురని తేటతెల్లమైంది. 70 మంది పంచాయతీ కార్యదర్శులను గుర్తించారు. ఆ పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ ఆమోదంతో నోటీసులను గురువారం రాత్రి డీపీఓ జారీ చేశారు.

నోటీసులు జారీ చేస్తున్నాం



విధులకు హాజరు కాకుండా నకిలీ అటెండెన్స్ యాప్‌లో అప్‌లోడ్ చేసి 70 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులను గుర్తించాం. వారికి కలెక్టర్ అనుమతితో నోటీసులు జారీ చేస్తున్నాం. ఉన్నత అధికారుల మేరకు కఠిన చర్యలు తీసుకుంటాం.

-దేవకి దేవి, డీపీఓ

డైట్ మెనూ తప్పనిసరి

- పాటించకుంటే కఠిన చర్యలు
- కలెక్టర్ హైమావతి
- పుల్లూరు జెడ్పీ స్కూల్ సందర్శన



వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేటరూరల్: ప్రభుత్వ బడుల్లో డైట్ మెనూ ప్రకారం భోజనం అందించాలని, పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హైమావతి నిర్వాహకులను హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని పుల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. డైట్ ప్రకారం గురువారం బగారా అన్నం, మిక్స్‌డ్ వెజిటేబుల్ కూరను వండాల్సి ఉండగా సాధారణ అన్నం మిల్‌మేకర్ కూర, చింతపులుసు చారు వండడాన్ని గమనించారు. 95 మంది విద్యార్థులకు ఏడు కిలోల కూరగాయలు బదులు, తక్కువ శాతం కూరగాయలతో వండటంతో కలెక్టర్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తప్పకుండా డైట్ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ రికార్డుల్లో వివరాలు నమోదు చేయాలని ఇన్‌చార్జి హెచ్ఎంను ఆదేశించారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు

చిన్నకోడూరు(సిద్దిపేట): వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదని, వైద్య సిబ్బంది అంకిత భావంతో సేవలందించాలని కలెక్టర్ హైమావతి అన్నారు. గురువారం చిన్నకోడూరు పీహెచ్‌సీని, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ల్యాబ్‌లో ఎక్కువగా ఎలాంటి పరీక్షలు చేస్తున్నారని తెలుసుకున్నారు. కాలం చెల్లిన మందులు వాడకూడదని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యం చేయించుకోవాలని రోగులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణాల ప్రగతిపై ఎంపీడీఓతో సమీక్ష నిర్వహించారు. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ఎరువుల సరఫరా రికార్డులు పరిశీలించారు. సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీఓ సదానందం, ఎంపీడీఓ జనార్దన్, తహసీల్దార్ సలీమ్, ఎంపీఓ సోమిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వాహనదారుల భద్రత ముఖ్యం

సిద్దిపేటరూరల్: వాహనదారుల భద్రత ఎంతో ముఖ్యమని, ఎవరికి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హైమావతి అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్డు భద్రత కమిటీతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ రహదారిలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి, నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు కావాల్సిన వాటికి ఎస్టిమేట్ వేసి డాక్యుమెంట్లను తన వద్దకు తీసుకురావాలని ఆర్అండ్‌బి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనవసర మలుపులను మూసివేయాలని, సురక్షిత రవాణాకు కావాల్సిన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీలు, ఆర్అండ్‌బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన భగీరథ పైప్‌లైన్ పనులు



సాక్షి ఎఫెక్ట్..

గజ్వేల్: మల్లన్నసాగర్ నుంచి గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలకు ప్రత్యేక మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. 'సాక్షి' వరుస కథనాల నేపథ్యంలో స్పందించిన సంబంధిత అధికార యంత్రాంగం పనులను పూర్తి చేయించింది. గురువారం ట్రయల్ రన్ నిర్వహించి నీటి సరఫరాను ప్రారంభించారు. పైప్‌లైన్‌లు కొత్తవి కావడం వల్ల మంచినీటిని కొద్దిరోజుల వరకు కాచి వడపోసి వాడుకోవాలని మిషన్ భగీరథ ఎస్ఈ వెంకట్‌రెడ్డి తెలిపారు. పూర్తయిన పనులను పర్యవేక్షించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని తెలిపారు. పనులు పూర్తి కావడంతో ప్రజ్ఞాపూర్ వద్ద హెచ్ఎండబ్ల్యూఎస్(హైద్రాబాద్ మెట్రో వాటర్ వర్క్స్) మిషన్ భగీరథ ట్యాపింగ్ పాయింట్‌ను మూసేశారు. మంచినీటి సరఫరాకు సంబంధించి గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలకు స్వయం ప్రతిపత్తి లభించినట్లయింది. సరిపడా నీటి సరఫరా జరగనుంది.

ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలి

పట్టు పరిశ్రమ శాఖ జేడీ లత



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ లత

చిన్నకోడూరు(సిద్దిపేట): పట్టును విదేశాలకు ఎగుమతి చేయాలంటే స్థానికంగా పట్టు ఉత్పత్తి పెరగాలని పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ లత అన్నారు. మా పట్టు మా అభిమాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం చంద్లాపూర్‌లో పట్టు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కువ స్థాయిలో రైతులు పట్టు సాగు చేయడానికి ముందుకు రావాలన్నారు. పట్టు సాగుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను వివరించారు. సేంద్రియ ఎరువులతో మల్బరీ తోట సాగు చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వినోద్ కుమార్, రాఘవేందర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి రేణు శర్మ, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

డీఎంహెచ్ఓ ధనరాజ్



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ ధనరాజ్

సిద్దిపేటరూరల్: ప్రస్తుతం వానాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ ధనరాజ్ వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం మండల పరిధిలోని పుల్లూరు, నారాయణరావుపేట, చింతమడక గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ఆస్పత్రుల్లో అత్యవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వైద్యులు, సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించి అంకిత భావంతో సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు బాపురెడ్డి, వినోద్, భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనలేం.. కొట్టలేం

బెంబేలెత్తిస్తున్న టెంకాయ ధరలు

- రూ.45 పలుకుతున్న కొబ్బరికాయ
- పండుగల నేపథ్యంలో రోజురోజుకు పెరుగుతున్న ధరలు
- ఏపీలో ఉత్పత్తి తగ్గడమే కారణమంటున్న వ్యాపారులు
- నారికేళం బాటలోనే కొబ్బరి బోండాలు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పవిత్ర కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు, పూజ కార్యక్రమాలలో కొబ్బరి కాయలను విరివిగా వినియోగిస్తారు. ఎన్నో పవిత్రమైన విశిష్టతలు కల్గిన టెంకాయ ధర రోజురోజుకు పెరుగుతోంది. ప్రస్తుతం శ్రావణమాసం కావడం.. ప్రతి ఇంటిలో, ఆలయాలలోని పూజ కార్యక్రమాలలో కొబ్బరికాయల వినియోగం మరింత పెరిగింది. గతేడాది ఇదే సమయంలో టెంకాయ ధర రూ. 30 వరకు ఉండగా, నేడు రూ.45 వరకు ధర పలుకుతోంది. ముఖ్యంగా జిల్లాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి కొబ్బరికాయలు వస్తుంటాయి. జిల్లాలో యాభై వరకు కొబ్బరికాయల హోల్‌సెల్ విక్రయాల దుకాణాలు ఉన్నాయి. రోజూ లారీలతో పాటు ఇతర చిన్న వాహనాలలో కొబ్బరి కాయలు వస్తుంటాయి. ఈ హోల్‌సెల్ దుకాణాలను అధికంగా ఏపీ నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారే నిర్వహిస్తున్నారు.

ఉత్పత్తి తగ్గడమే కారణం

వాతావరణం, అక్కడి పంటల సాగులో వచ్చిన మార్పుల నేపథ్యంలో ఏపీలో కొబ్బరికాయల ఉత్పత్తి తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో వ్యాపారులు తమిళనాడు, కేరళ నుంచి కొబ్బరికాయలను దిగమతి చేసుకుంటున్నారు. సరుకు వాహనాల కిరాయి, హమాలీల కూలీలు కలుపుకుని కొబ్బరికాయల విక్రయాల ధరలను నిర్ణయిస్తున్నారు. దీంతో ధరలు మరింత ప్రియం అవుతున్నాయి.

కొబ్బరి బోండాలు సైతం..

కొబ్బరి కాయల బాటలోనే కొబ్బరి బోండాల ధరలు పరుగులు తీస్తున్నాయి. కొబ్బరిబోండాలు ధరలు రూ.40 నుంచి రూ.60 వరకు ధర పలుకుతున్నాయి. అదేవిధంగా కొబ్బరి నీరు లీటరుకు రూ.150 నుంచి ఆ పైన ధర పలుకుతుంది. కొబ్బరి నీరు రోగులతో పాటుగా, వృద్ధులు, చిన్నారులు అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో కొబ్బరి బోండాలకు గిరాకీ పెరిగింది.



ధరలు బాగా పెరిగాయి

కొబ్బరి కాయల ధరలు బాగా పెరిగాయి. ఒక్కొక్కటి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. శ్రావణమాసం పూర్తయ్యే వరకు రోజు పూజలలో కొబ్బరికాయాల వినియోగం అధికంగా ఉంటాయి. రానున్న రోజుల్లో పెద్ద పండుగలు ఉన్నాయి. ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

- మహిళ, సిద్దిపేట

ఉత్పత్తి తగ్గిపోవడం వల్లే..



కొబ్బరి కాయల ఉత్పత్తి గతంలో కంటే బాగా తగ్గింది. ముఖ్యంగా ఏపీ నుంచి దిగుమతి అవుతాయి. కానీ అక్కడ వివిధ కారణాలతో ఉత్పత్తి తగ్గడంతో తమిళనాడు, కేరళ నుంచి కొబ్బరికాయలను దిగుమతి చేసుకుంటున్నాం. అందు వలన రవాణా, కూలీల చార్జీలు పెరగడంతో ధరలు పెరిగాయి.

-శ్రీనివాస్, కొబ్బరికాయల హోల్‌సేల్ వ్యాపారి, సిద్దిపేట

పథకాల అమల్లో ఉద్యోగులే కీలకం

- డిమాండ్లు పరిష్కరించాలి
- టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మార్గం జగ



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వర్

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చేది ఉద్యోగులేనని టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మార్గం జగదీశ్వర్ అన్నారు. గురువారం హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకుడు మధుసూదన్‌రెడ్డి పదవీ వీరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని 56 డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్తే 16 డిమాండ్లను పరిష్కరించడానికి ఆగస్టు 15 వరకు గడువు పెట్టారని చెప్పారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కారించకపోతే ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో మరో కార్యాచరణను రూపొందిస్తామన్నారు. లెక్చరర్ల సర్వీసును 65 ఏళ్లకు పెంచడానికి సీఎం సానుకూలంగా స్పందించారని త్వరలోనే ఆచరణలోకి వస్తుందని చెప్పారు. ఉద్యోగులు సైతం చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో పుల్లయ్య, ప్రిన్సిపాల్ శ్రీదేవి, అభినవ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పక్కాగా భూముల సర్వే
రాష్ట్ర సీసీఎల్ కమిషనర్ లోకేశ్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టరు మాధురి, తదితరులు

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం పైలట్ గ్రామాల్లో చేపట్టిన భూముల సర్వే పక్కాగా చేయాలని రాష్ట్ర సీసీఎల్ కమిషనర్ లోకేశ్ కుమార్ ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్యతోపాటు అధికారులు హాజరయ్యారు. జిల్లాలో వట్‌పల్లి మండల పరిధిలోని షాహీద్ నగర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. గ్రామంలో (రీ–సర్వే)కు సంబంధించి ఎంజాయ్‌మెంట్ రికార్డుల ప్రకారం భూముల సర్వే నిర్వహించాలన్నారు. సర్వేలో వచ్చిన వివరాలు పాత రికార్డులతో సరిగా ఉన్నాయా, హెచ్చు తగ్గులు ఉన్నాయా వంటి వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, సర్వే ల్యాండ్ జిల్లా అధికారి ఐనేష్, ఆర్డీఓ పాండు తదితరులు పాల్గొన్నారు.

3న ఉమ్మడి జిల్లా బాల్ బాడ్మింటన్ జట్ల ఎంపిక

మిరుదొడ్డి(దుబ్బాక): మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3న ఉమ్మడి మెదక్ జిల్లా సీనియర్, సబ్ జూనియర్ అండర్–15 జట్లను ఎంపిక చేస్తామని అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి.భైరయ్య, కార్యదర్శి పీవీ రమణ తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్ జీరాక్స్, మూడు పాస్ పోర్టు సైజు ఫోటోలతో రామచంద్రాపురంలోని ఓల్డ్ ఎంఐజీ గ్రౌండ్‌లో ఆదివారం హాజరు కావాలని కోరారు. ఉదయం 9 గంటలకు సీనియర్ జట్లు, తదుపరి సబ్ జూనియర్ అండర్–15 జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు ఉమ్మడి జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. ఎంపికైన సీనియర్ జట్లు ఈ నెల 23, 24 తేదీలలో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని గోలేటి టౌన్ షిప్‌లో జరిగే రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 97047 46511, 94407 03038 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సాంబర్‌లో పురుగు
- వినియోగదారుల ఆందోళన
- హోటల్ సీజ్



సాంబర్‌లో పురుగు

దుబ్బాక: పట్టణంలోని ఓ హోటల్‌లో టిఫిన్ చేస్తుండగా సాంబర్‌లో పురుగు రావడంతో వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజక్కపేటకు చెందిన యాదగిరి గురువారం ఉదయం తన స్నేహితులతో కలిసి పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ఉడిపీ శ్రీకృష్ణ హోటల్‌లో టిఫిన్ తింటుండగా.. సాంబర్‌లో పురుగు కనబడింది. దీంతో యాదగిరి, అతని స్నేహితులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే హోటల్ యజమానికి విషయం తెలిపారు. హోటల్‌లో టిఫిన్ తిన్న యాదగిరితో పాటు పలువురు వాంతులు చేసుకోవడంతో వారిని ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ అధికారులు హోటల్‌కు తాళం వేసి ఫుడ్‌సేఫ్టీ అధికారులకు సమాచారం అందించారు.

కుక్క కాటు.. ఇరువురికి గాయాలు



కుక్కదాడిలో గాయపడిన నాగమణి

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం అచ్చంపేటలో పిచ్చికుక్క దాడిలో ఇరువురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన వనబోయిన నాగమణి, శ్రీనివాస్‌లపై పిచ్చికుక్క దాడి చేసి కరిచింది. తీవ్రంగా గాయపడిన నాగమణిని వెంటనే గాంధీ ఆసుపత్రికి, శ్రీనివాస్‌ను వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొన్ని నెలలుగా గ్రామంలో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉందని, వాటి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

కరవు నేలను ముద్దాడిన వరద నీరు..!

ఫలించిన రైతు భగీరథ యత్నం



బావిలో ఊట నీరుతో పెరిగిన భూగర్భ జలాలు

హుస్నాబాద్‌రూరల్: భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలకు సాగునీరు అందక రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. చేతికొచ్చిన పంటలను సరిపడా నీరందక పశువుల మేతకు వదిలేసిన దాఖలాలు ఉన్నాయి. పెట్టుబడుల భారంతో మెట్ట రైతులు ఆర్థిక నష్టాలను సైతం భరిస్తున్నారు. అయితే.. నిత్యం వేధించే సాగునీటి సమస్యను శాశ్వతంగా దూరంగా చేయాలని ఓ రైతు ప్రయత్నం ఫలించింది. ఆర్థిక కష్ట, నష్టాలు.. కొన్ని సందర్భాల్లో నిరాశ పరిచినా ఎక్కడా వెనుకడుగు వేయలేదు.

- వరద నీరు మళ్లించి కొలను ఏర్పాటు
- బావుల్లో ఊట పెరగడంతో పాతాళ గంగ పైపైకి ..
- బీళ్లకు నీరు పారించి పంటలు సాగు చేస్తున్న రైతు
- 20 ఎకరాలలో వరి, మొక్కజొన్న పంటల సాగు
- సత్ఫలితాలిస్తున్న రైతు రాంగోపాల్‌రావు కృషి

హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌కు చెందిన రైతు మాదారపు రాంగోపాల్‌రావు తన ఆలోచనలకు పదును పెట్టి ఏకంగా ఇరవై ఎకరాలకు సాగునీరందేలా చేసిన కృషి ఇప్పుడు సత్ఫలితానిస్తోంది. కోర్టు కేసుల కారణంగా మొన్నటి వరకు గోదావరి జలాలతో గౌరవెల్లి ప్రాజెక్టు నింపితే పంటలకు కావాల్సిన సాగు నీరు అందుతుందన్న ఆశలను రైతులు వదులుకున్నారు. రెండేళ్ల యాసంగి పంటలకు సాగు నీరందక పంటలు ఎండిపోతే చాలా మంది రైతులు చేసేదేమిలేక పశువుల మేతకు వదిలేశారు. అయితే.. రాంగోపాల్‌రావు మాత్రం తన ముందున్న ప్రతికూల పరిస్థితులకు భయపడలేదు. మెదడుకు పదును పెట్టాడు. గతంలో ఊటబావి తవ్వించాడు. నీరు పడలేదు. సరిగా నీరందక ఎండిన పంటలను పశువుల మేతకు వదిలేసి.. మరో బావిని తవ్వే పనులు మొదలు పెట్టాడు. రూ.5 లక్షల వ్యయంతో 25 గజాల బావి తవ్వించి సిమెంట్ రింగ్‌లు పోయించాడు. వేసవిలో నీరు లేకపోయినా నిరుత్సాహపడలేదు, బావి పక్కనే 10 గుంటల విస్తీర్ణంలో చిన్న కొలను తవ్వించి.. అందులోకి వరద నీటిని మళ్లించి చిన్న చెరువులా చేశాడు. దీంతో బావిలో నీటి ఊటలు రావడం ప్రారంభమైంది. చూస్తుండగానే బావిలో నీరు పుష్కలంగా ఉండటంతో పంటలకు సాగునీటి కొరత లేకుండా పోయింది. తన పదెకరాల పొలంతో పాటు అదనంగా మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకొని బీడు భూమిని చదును చేసి వరి సాగు చేస్తున్నాడు రాంగోపాల్‌రావు. నిన్నటి వరకు నీళ్లు లేని బావులు ఇప్పుడు చిన్న కొలను ఏర్పాటు చేయడం ద్వారా రెండు ఊట బావుల్లో భూగర్భ జలాలు పైపైకి వచ్చి రైతులను ఆశ్చర్య పరుస్తున్నాయి. రెండేళ్ల రైతు శ్రమకు కావాల్సిన సాగు నీరు రావడంతో రాంగోపాల్‌రావు ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

> ఓ రైతు భగీరథ యత్నం ఫలించింది. కరువుతో అల్లాడుతున్న ఆ నేలకు వరద నీరు ముద్దాడేలా చేశాడు. బీడు భూములను సస్య శ్యామలం చేశాడు.



కష్టపడితే నీళ్లరేవొచ్చింది

“గౌరవెల్లి ప్రాజెక్టు నింపితే పంటలకు సాగు నీరు వస్తుందని ఆశపడ్డాం. ఇప్పుడు కోర్టు కేసులతో గోదావరి జలాలు వచ్చే నమ్మకం లేదు. రెండేళ్ల పది ఎకరాల్లో పంట ఎండి రూ.10లక్షల నష్టం వచ్చింది. కష్టపడి బావి తవ్వితే.. ఇప్పుడు నీళ్ల రేవు వచ్చింది. నీటి కొలనుతో బావిలో ఊట నీరు పెరిగింది. పంటలకు కావాల్సిన నీళ్లు రెండు బావులు అందిస్తున్నాయి.

రాంగోపాల్‌రావు, రైతు



బావి పక్కనే రైతు ఏర్పాటు చేసిన నీటి కొలను



బీడు భూములు సాగులోకి..

యూ టర్న్ తీసుకుంటుండగా..

- ఢీకొని పల్టీ కొట్టిన రెండు లారీలు
- ఒకరికి తీవ్రగాయాలు



పల్టీ కొట్టిన లారీ

మనోహరాబాద్(తూప్రాన్): జాతీయ రహదారి–44పై రెండు లారీలు ఢీకొని పల్టీ కొట్టాయి. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి కామారెడ్డి వెళుతున్న లారీ మండలంలోని కాళ్లకల్ శివారులోకి రాగానే యూ టర్న్ చేస్తున్న క్రమంలో లారీని ఢీకొట్టింది. దీంతో రెండు లారీలు పల్టీ కొట్టాయి. లారీ డ్రైవర్‌కు కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాఫిక్ స్తంభించడంతో జీఎమ్మార్ సిబ్బంది క్లియర్ చేశారు. గాయపడిన డ్రైవర్‌ను అంబులెన్సులో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

దశదిన కర్మ స్నానానికి వెళ్లి..

చెరువులో మునిగి యువకుడి మృతి



పర్శరాములు (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): దశదిన కర్మలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో గురువారం జరిగింది. భూంపల్లి ఎస్‌ఐ హరీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఏదుల పర్శరాములు (28) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ భార్య నవనీత, ఐదు నెలల కుమారుడితో పాటు, తల్లిదండ్రులను పోషించుకుంటున్నాడు. కాగా పర్శరాములు పాలివారైన చుక్క పోచయ్య ఇటీవల చనిపోవడంతో గురువారం దశదిన కర్మ ఉండగా.. తోటి కులస్తులతో భూంపల్లి శివారులోని చెరువు వద్దకు స్నానానికి వెళ్లారు. ఈ క్రమంలో చెరువులో దిగి స్నానం చేస్తుండగా పర్శరాములు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. అక్కడున్న వారు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా మూడు గంటల పాటు గజ ఈతగాళ్లు శ్రమించి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. కేసు దర్యాప్తులో ఉంది.

చింతకుంట టు ‘చిట్కుల్’

- క్యూగట్టిన కల్లు ప్రియులు
- చింతకుంట, పోసానిపేటలలో కల్లు దుకాణాలు మూసివేత
- మొదటిసారిగా నాలుగురోజులుగా బంద్
- అక్రమంగా కల్లు తెచ్చుకుంటున్నా పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



పోసానిపేటలో మూసి ఉన్న కల్లు దుకాణం

వట్‌పల్లి(అందోల్): అందోలు మండలం పరిధిలోని చింతకుంట, పోసానిపేట గ్రామాల్లో కల్లు దుకాణాలను మూసేశారు. దీంతో కల్లు ప్రియుల బాధలు వర్ణనాతీతం. కల్లుకు బానిసైన కుటుంబాలు ఎక్కువగా ఉండటంతో చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రా మంలోని కల్లు దుకాణాలకు క్యూగట్టారు. జోగిపేట గీతా పారిశ్రామిక సహకార సంఘానికి చెందిన కొంత మంది సభ్యులు తమకు రావాల్సిన వాటా డబ్బులు కాంట్రాక్టర్ ఇవ్వలేదన్న ఆరోపణలతో ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయడమే కాకుండా, అందోల్‌లోని కల్లు డిపోలో కల్లును తయారు చేసి రవాణా చేయకుండా అడ్డుకున్నారు. దీంతో జోగిపేట, పోసానిపేట, చింతకుంట గ్రామాల్లో కల్లు విక్రయాలు నిలిచిపోయాయి. నాలుగు రోజుల పాటు స్థానికంగా కల్లు విక్రయాలు నిలిచిపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. స్థానికంగా కల్లుకు బానిసై న కుటుంబాలు వందల సంఖ్యలో ఉన్నాయి. ఒక్క రోజు కల్లు సేవించనట్లయితే నరాలు పీక్కుపోవడం, అనారోగ్యానికి గురికావడం వంటి ఘటనలు గతంలో జరిగాయి.

దారులన్నీ చిట్కుల్‌వైపే...

స్థానికంగా కల్లు విక్రయాలు నిలిచిపోవడంతో మూడు గ్రామాలకు చెందిన కల్లు ప్రియులు చిట్కుల్ గ్రామానికి తరలివెళుతున్నారు. అక్కడ విక్రయించే కల్లులో మత్తు పదార్థాలు ఎక్కువగా కలపడం వల్ల కూడా స్థానికులు బాగా ఆకర్షితులవుతున్నారు. ప్రతి రోజు జోగిపేటకు చెందిన వారు మహిళలే 5, 10 లీటర్ల ప్లాస్టిక్ డబ్బాలలో ఆర్టీసీ బస్సుల్లో తెచ్చుకుంటున్నారు. మహిళలకు బస్సు ఫ్రీ కావడం కూడా వారికి కలసి వస్తుంది. ప్రభుత్వం లైసెన్స్‌లు కలిగి ఉన్న దుకాణాలు మూసి ఉంచినా ఎక్సైజ్ అధికారుల్లో ఎలాంటి స్పందన లేకపోవడం విశేషం.

చిట్కుల్ కల్లు కోసం వెళ్లి మృత్యు ఒడిలోకి..

జోగిపేటలో కల్లు అందుబాటులో ఉన్నప్పటికీ మత్తుకు అలవాటు పడిపోయి చిట్కుల్‌కు ప్రతి రోజు ద్విచక్రవాహనాలపై వెళుతున్నారు. అక్కడే కల్లు సేవించి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇప్పటివరకు పది మందికిపైగా మృత్యువాతకు గురైన సంఘటనలున్నాయి. ఈ విషయం స్థానిక ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా అక్రమ కల్లు రవాణాను అడ్డుకున్న దాఖలాలు లేవనే చెప్పవచ్చు.

ఆటో–బైక్ ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలకు గురైన యువకులు

చిన్నశంకరంపేట(మెదక్): ఆటో–బైక్ ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. గురువారం ఖాజాపూర్ తండాకు చెందిన బానోత్ రమేశ్, జీవన్, సుధాకర్ ద్విచక్రవాహనంపై మెదక్ వెళుతున్నారు. ఇదే సమయంలో సుల్తాన్‌పూర్‌కు చెందిన టాటాఏసీ –బైక్ ఢీకొన్నాయి. దీంతో ముగ్గురు యువకులు తీవ్రగాయాలకు గురయ్యారు. వీరిని వెంటనే మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో తొమ్మిది మందికి జరిమాన

పటాన్‌చెరు టౌన్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో తొమ్మిది మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారి వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున జరిమాన, మరో ఇద్దరికి మందికి రూ.1,500 జరిమాన విధించినట్లు తెలిపారు.

బాలసదనం సందర్శించిన న్యాయమూర్తి



మొక్క నాటుతున్న మిలింద్ కాంబ్లే

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రం సిద్దిపేటలోని బాల సదనాన్ని గురువారం జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి మిలింద్ కాంబ్లే సందర్శించారు. ఈ సందర్భంగా మొక్కను నాటారు. అనంతరం అవగాహన సదస్సు నిర్వహించారు. అక్కడి పిల్లలతో యోగ క్షేమాలు గూర్చి అరాతీశారు. పిల్లలకు చదువు విలువ గూర్చి వివరించారు. సమస్యలు ఉంటే అథారిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం రిజిస్టర్ పరిశీలించారు. భోజనం నాణ్యత, వంటగది తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ సంతకం ఫోర్జరీ

- నకిలీ పట్టాల సృష్టించిన అక్రమార్కులు
- నలుగురిపై కేసు నమోదు

జహీరాబాద్ టౌన్: కొంత మంది అక్రమార్కులు ఏకంగా తహసీల్దార్ సంతకాలను ఫోర్జరీచేసి నకిలీ పట్టాలను సృష్టించారు. ఇంటి నంబర్ కేటాయించాలని మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు పెట్టుకోగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. వివరాలు.. జహీరాబాద్ పట్టణంలోని డ్రైవర్ కాలనీ, రాంనగర్, బాగారెడ్డిపల్లి తదితర ప్రాంతాల్లోని 50, 173, 40, 139 తదితర సర్వే నంబర్‌లు కలిగిన ప్రభుత్వ భూమి ఉంది. గతంలో అర్హులైన పేదలకు రెవెన్యూ అధికారులు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అధికశాతం మంది లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. కొంత మంది అక్రమార్కులు ప్రభుత్వ భూముల సర్వేనంబర్‌లపై నకిలీ పట్టాలు సృష్టించి తహసీల్దార్‌ల సంతకాలను ఫోర్జరీ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన సర్టిఫికెట్ల ఆధారంగా ఇళ్లను నిర్మించుకున్నామని, ఇంటి నంబర్ కేటాయించాలని మున్సిపల్ కార్యాలయంలో నలుగురు దరఖాస్తు చేసుకున్నారు. సర్టిఫికెట్లను పరిశీలించిన మున్సిపల్ అధికారులకు అనుమానం కలిగింది. సర్టిఫికెట్లను పరిశీలించి ఇవి ఒరిజినల్‌వా తెలపాలని రెవెన్యూ అధికారులకు పంపారు. సమగ్ర విచారణ చేపట్టిన రెవెన్యూ అధికారులు.. బోగస్ పట్టాలుగా గుర్తించారు. తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసి నకిలీ పట్టాలు సృష్టించారని నిర్ధారించారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు నలుగురిపై జహీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ తెలిపారు.

హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

చిన్నకోడూరు(సిద్దిపేట): హత్య కేసులో భర్తకు కోర్టు జీవిత ఖైదు విధించినట్లు సీఐ శ్రీను, ఎస్‌ఐ సైఫ్ అలీ తెలిపారు. చిన్నకోడూరు మండలం విఠలాపూర్‌కు చెందిన గంగసాని శ్రీనివాస్ రెడ్డికి కర్ణాటక రాష్ట్రం రాయిచూర్‌కు చెందిన ఇందిరతో కట్నకానుకలు ఇచ్చి వివాహం జరిపించారు. కొన్నేళ్ల పాటు వారి సంసారం సాఫీగానే సాగింది. అనంతరం అదనపు కట్నం కోసం భర్త, అత్త మామలు ఇందిరను వేధించడం ప్రారంభించారు. విషయం ఇందిర తన సోదరుడు వీరేష్ రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం తెలిపింది. ఈ క్రమంలో 2019 ఏప్రిల్ 10న ఉదయం ఇందిర ఆత్మహత్య చేసుకుందని మృతురాలి సోదరుడికి సమాచారం ఇచ్చారు. ఇందిరను గొంతు నులిమి హత్య చేశారని సోదరుడు వీరేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భర్త శ్రీనివాస్ రెడ్డిపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టిన పోలీసులు.. నిందితుడిని రిమాండ్‌కు పంపారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ వేశారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి సాయిరమాదేవి.. నేరం రుజువుకావడంతో శ్రీనివాస్ రెడ్డికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ రూ. 2 వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

180 ఎండు గంజాయి, బైకు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు యువకులను చేర్యాల పోలీసులు, సిద్దిపేట టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. చేర్యాల సీఐ శ్రీను కథనం ప్రకారం .. గురువారం ఉదయం చేర్యాల హెచ్‌పీ పెట్రోలు పంపు వెనకాల ఉన్న చెట్లలో గంజాయి విక్రయించేందుకు పలువురు యువకులు ప్రయత్నిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చేర్యాల పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. నీల చందు, ఆకుల హర్షవర్ధన్ వద్ద 180 గ్రాముల ఎండు గంజాయి లభించిందని, వారు హైదరాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద విక్రయించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ఎండు గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఐదేళ్ల జైలు.. జరిమానా

నారాయణఖేడ్: గంజాయి సాగు కేసులో నిందితుడికి జిల్లా మొదటి శ్రేణి అదనపు న్యాయమూర్తి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.25 వేల జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు నారాయణఖేడ్ ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సిర్గాపూర్ మండలం వంగ్దాల్ పరిధిలోని గైర్హాన్ తండాకు చెందిన మూడ్ గణపతి చౌహాన్ తన వ్యవసాయ పొలంలో గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం అందడంతో అప్పటి జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి బాలకృష్ణారెడ్డి, ఎస్‌ఐ సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో 2013 ఆగస్టు 24న దాడి చేశారన్నారు. దీంతో గణపతి చౌహాన్ పొలంలో 75 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు. ఈ కేసును జిల్లా అదనపు కోర్టులో విచారణ జరపడంతో కోర్టు పీపీ రాజేశ్వర్ వాదించి నేరం రుజువు చేయడంతో నిందితుడికి న్యాయమూర్తి జయంతి పై శిక్ష విధించారు.

మునిపల్లిలో..

మునిపల్లి(అందోల్): గంజాయి సాగు చేసిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేలు జరిమాన విధించినట్లు ఎక్సైజ్ సీఐ ఎండి.నజీర్ పాషా తెలిపారు. గురువారం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. 2021 సంవత్సరంలో మునిపల్లి మండలం పెద్దలోడి గ్రామానికి చెందిన రాములు దగ్గర 36 గంజాయి మొక్కలు అప్పట్లో దొరికినట్లు తెలిపారు. దీంతో గురువారం న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.

ప్రాణాలు పోతున్నా.. హెల్మెట్లు పెట్టరా..?

- ప్రతినెల నగటున 11 మంది మృత్యువాత
- జిల్లావ్యాప్తంగా ఏడు నెలల్లో 400 ప్రమాదాలు
- 179 మరణాలు.. ద్విచక్ర వాహనదారులు 118 మంది
- జరిమాన విధించినా కానరాని మార్పు



మెదక్‌జోన్: ‘‘హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనం నడపొద్దు.. లేకుంటే ప్రాణాలకే ప్రమాదం’’ అని పోలీసులు ఎంత అవగాహన కల్పించినా వాహనదారుల్లో మాత్రం ఆశించిన మార్పు కనిపించడం లేదు. నిత్యం జరిమానాలు విధించినా ఫలితం లేకుండా పోతుంది. ఫలితంగా జిల్లాలో ప్రతినెల సగటున 11 మంది హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. తమ కుటుంబ సభ్యులకు శోకం మిగుల్చుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు ఏడు మాసాల్లో 400 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అందులో 179 మంది మరణించారు. వారిలో 118 మంది ద్విచక్ర వాహనదారులు కాగా, 61 మంది ఇతర వాహనదారులు ఉన్నారు. కేవలం హెల్మెట్లు ధరించక పోవటంతోనే 76 మంది మరణించినట్లు పోలీసులు చెబుతున్నారు.

రోడ్ల మీదకు వస్తున్న కుటుంబాలు

రోడ్డు ప్రమాదంలో కుటుంబపెద్ద మరణిస్తే.. ఆ కుటుంబం రోడ్డు మీదకు వస్తోంది. పిల్లల చదువులు ఆగిపోతాయి. కుటుంబ భారం మహిళపై పడుతోంది. ఒకవేళ పెళ్లికాని యువత చనిపోతే జన్మనిచ్చిన తల్లి దండ్రులకు తీరని కడుపు కోత మిగిలిపోతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ కుటుంబమే రోడ్డుపైకి వస్తోంది. ఇంత జరుగుతున్నా ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు ధరించకుండా నిర్లక్ష్యంగా నడపటం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు.

కలెక్టర్ కట్టడిచేసినా..

ద్విచక్రవాహన దారులు తప్పకుండా హెల్మెట్లు ధరించాలని, లేకుంటే కలెక్టరేట్ ఆవరణలోకి అనుమతించ వద్దని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఫిబ్రవరిలో తన సిబ్బందిని ఆదేశించారు. దీంతో కలెక్టరేట్‌కు వెళ్లే ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించే కార్యాలయానికి వెళ్లేది. ఆ నెలలో 95శాతం మంది ద్విచక్రవాహన దారులు హెల్మెట్లు ధరించారు. కొంత కాలం తర్వాత మళ్లీ యథాస్థితే. కాగా, జిల్లాలో హెల్మెట్ ధరించని వారికి భారీగా జరిమానాలు విధిస్తున్నా వాహనదారుల్లో మార్పు కానరావడం లేదు. ఈ విషయమై అధికారులు కఠినంగా వ్యవహరించాల్సి అవసరం ఎంతైనా ఉంది.

మీ సేవలు శ్లాఘనీయం

జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్



పదవీ విరమణ పొందిన అదనపు ఎస్పీని సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్

సంగారెడ్డి జోన్: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజమేనని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ స్పష్టం చేశారు. జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, ఎస్సై యాదవిరెడ్డి, అలీముద్దీన్, ఏఎస్సై అజీముద్దీన్ పదవీ విరమణను పురస్కరించుకుని గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. విరమణ పొందిన అధికారులను పూల మాల శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసు శాఖకు అందించిన సేవలు మరువలేనివన్నారు. పదవీ విరమణ అనంతరం వారికి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ సకాలంలో అందే విధంగా చూస్తామన్నారు. అలాగే జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని నెలరోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్–1861 అమలులో ఉంటుందని తెలిపారు. ముందస్తు అనుమతి లేనిదే ప్రజలు, ప్రజాప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. వర్టికల్ డీఎస్పీ శ్రీనివాసరావ్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కల్యాణి, ఏఆర్ డీఎస్పీ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.